కాంగ్రెస్ వర్సెస్ కాంగ్రెస్..

- కోరుట్ల మున్సిపల్ సమావేశంలో బహిర్గతమైన విభేధాలు
- వరద ప్రభావిత ప్రాంతాల నిధుల మళ్లింపుపై నిరసన
- వాకౌట్ చేసిన వైస్ చైర్మన్ వర్గం

కోరుట్ల, అక్టోబర్ 29: కోరుట్ల మున్సిపల్ అధికార పక్షంలో విభేధాలు బహిర్గతమయ్యాయి. ఇటీవల వరద ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధి పనుల కోసం కేటాయించిన నిధుల మళ్లింపుపై వివాదం జరుగుతున్నది. ఈ క్రమంలో మంగళవారం జరిగిన మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో విభేధాలు తారాస్థాయికి చేరి వాకౌట్‌కు దారి తీశాయి. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం చైర్‌పర్సన్ అన్నం లావణ్య అధ్యక్షతన మున్సిపల్ అత్యవసర సమావేశాన్ని అధికారులు నిర్వహించారు. పలు అభివృద్ధి పనుల ఆమోదం కోసం 7 ఎజెండా అంశాలను అధికారులు సభలో ప్రవేశపెట్టారు. ఇంతలో అధికార పక్ష మున్సిపల్ వైస్ చైర్మన్ గడ్డమీది పవన్ అధికారులు ప్రవేశపెట్టిన అంశాలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇటీవల వరద ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధి పనుల కోసం రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధులు రూ. 28.80 లక్షలు కలెక్టర్ కేటాయిస్తే, వరదలు రాని వార్డులకు మళ్లించడంపై మండిపడ్డారు. పోడియం వద్ద కొద్దిసేపు కౌన్సిలర్లతో కలిసి బైఠాయించారు. వరద ప్రభావిత ప్రాంతాలపై అధికారులు, చైర్‌పర్సన్ శీతకన్ను ప్రదర్శించారని, కనీసం కౌన్సిలర్లకు సమాచారం లేకుండా ఇష్టారీతిలో నిధులు కేటాయించడం ఏంటని ప్రశ్నించారు. నిధులు కేటాయించే సమయంలో కౌన్సిల్ సభ్యుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా అధికారులు ఇతర ప్రాంతాలకు వరద ప్రభావిత నిధులు మళ్లించారని ఆరోపించారు. 2020లో ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులు పెండింగ్‌లో ఉంటే కనీసం కౌన్సిల్ సభ్యులకు సమాచారం ఇవ్వలేదన్నారు. ఇప్పుడు ఆ నిధులు రూ. 2.30 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు రూపొందించడం వెనుక ఆంతర్యమేంటని అనుమానం వ్యక్తం చేశారు. కౌన్సిల్ సభ్యుల అభిప్రాయాలు తీసుకోకుండా అధికారులు ఏకపక్షంగా ఆయా వార్డులకు నిధులు కేటాయిస్తూ ప్రవేశపెట్టిన అంశాలను మూకుమ్మడిగా కౌన్సిల్ సభ్యులు తిరస్కరించారు. ముందుగా సభ నుంచి మున్సిపల్ వైస్ చైర్మన్‌ను వాకౌట్ చేయగా అధికార, ప్రతిపక్ష సభ్యులు ఆయనను అనుసరించి బయటకు వచ్చారు. ఈవిషయమై కమిషనర్‌ను వివరణ కోరగా, నిబంధనల మేరకే అత్యవసర పనులకు నిధులు కేటాయించడం జరిగిందన్నారు. అభివృద్ధి పనులకు సంబంధించి నిధుల కేటాయింపులో అధికారులు అన్ని వార్డులకు సమప్రాధాన్యం ఇచ్చినట్లు తెలిపారు.

నిధుల మళ్లింపుపై కలెక్టర్‌కు ఫిర్యాదు

వరద ప్రభావిత నిధుల మళ్లింపుపై వైస్ చైర్మన్ గడ్డమీది పవన్ కలెక్టర్ సత్యప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో కాకుండా ఇతర ప్రాంతాల్లో అభివృద్ధి పనుల కోసం నిధులు కేటాయింపుపై విచారణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కౌన్సిల్ సభ్యులకు సమాచారం ఇవ్వకుండా అధికారులు వివక్ష చూపుతున్నారని, నిధుల కేటాయింపు రద్దు చేయాలని కోరారు.

ఉపాధ్యాయులకు సత్కారం

వెల్గటూర్, అక్టోబర్ 29: వెల్గటూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేసి బదిలీ, ఉద్యోగోన్నతిపై వెళ్లిన ఉపాధ్యాయులు భాషా, రాజేశ్వరి, లావణ్య, మేరి అపరంజి, రాజ్‌కుమార్‌తో పాటు ఆఫీస్ సబార్డినేట్ రాజేందర్‌కు మంగళవారం ఆత్మీయ సత్కారం చేశారు. వారి సేవలను కొనియాడుతూ జ్ఞాపికలు, శాలువాలతో సత్కరించారు.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం


పెగడపల్లి: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సింగిల్ విండో చైర్మన్ రమణారావు

పెగడపల్లి, అక్టోబర్ 29: పెగడపల్లి మండల కేంద్రంతో పాటు మద్దులపల్లి, ఆరవల్లి, దోమలకుంట, సుద్దపల్లి, లింగాపూర్, బతికపల్లి, వెంగళాయిపేట గ్రామాల్లో పెగడపల్లి సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం సంఘం చైర్మన్ వోరుగంటి రమణారావు ప్రారంభించారు. అలాగే, నంచర్ల సహకార సంఘం ఆధ్వర్యంలో రాంనగర్, కీచులాటపల్లి, ఎల్లాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సంఘం చైర్మన్ మంత్రి వేణుగోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రైతులు ధాన్యం ఆరబెట్టి, తూర్పార పట్టాక కేంద్రాలకు తీసుకురావాలని కోరారు. కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు చేపట్టాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో సహకార అధికారి మల్లేశం, సీఈవోలు గోపాల్‌రెడ్డి, మధుకర్, ఆర్బీఎస్ మాజీ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, డైరెక్టర్లు, నాయకులు మల్లారెడ్డి, ప్రవీణ్‌రావు, మల్లేశం, శ్రీనివాస్, ఎల్లయ్య, వెంకట్రావు, విజయ్‌యాదవ్, తిరుపతి, శ్రీనివాస్‌రెడ్డి, ఆనందం, రవీందర్, రైతులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్, అక్టోబర్ 29: మండలంలోని పెద్దాపూర్, రామారావుపల్లె గ్రామాల్లో ఎకిన్‌పూర్ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు సింగిరెడ్డి నర్సారెడ్డి, చేపూరి జీవన్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి, మద్దతు ధర పొందాలని సూచించారు. పీపీసీఎస్ డైరెక్టర్లు నర్సారెడ్డి, సాగర్, రాజం, భాగ్య, జనార్దన్, పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్, అక్టోబర్ 29: ఏకిన్‌పూర్, అయ్యప్పగుట్ట ప్రాంతంలో సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సహకార సంఘం అధ్యక్షుడు సింగిరెడ్డి నర్సారెడ్డి ప్రారంభించారు. రైతులకు వసతులు కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు చేపూరి జీవన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు కాశిరెడ్డి మోహన్‌రెడ్డి, సంఘం కార్యవర్గ సభ్యులు, ఏఈవోలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా కుటుంబ సర్వే పకడ్బందీగా చేపట్టాలి

వీసీకి హాజరైన కలెక్టర్, అదనపు కలెక్టర్

జగిత్యాల, అక్టోబర్ 29: ఇంటింటా కుటుంబ సర్వే పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు కలెక్టర్లకు సూచించారు. మంగళవారం ఆయన మధిర తహసీల్ కార్యాలయం నుంచి సీఎస్ శాంతికుమారి, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమగ్ర ఇంటింటా కుటుంబ సర్వేపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ, ఈ సర్వేలో ప్రజల సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల వివరాలను సేకరించాలన్నారు. అధికారులు వివరాలను సేకరించే క్రమంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. సర్వే నిర్వహణకు అవసరమైన ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లను గుర్తించి శిక్షణ ఇవ్వాలని సూచించారు. 150 కుటుంబాలకొక ఎన్యుమరేటర్‌ను నియమించాలని ఆదేశించారు. జిల్లా వారీగా సర్వే వివరాలు ప్రతి రోజూ సాయంత్రం 6 గంటలకు పంపించాలన్నారు. సీఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ, జిల్లా యంత్రాంగం సమన్వయంతో సమగ్ర ఇంటింటా కుటుంబ సర్వే చేపట్టి విజయవంతం చేయాలన్నారు. రాష్ట్ర బీసీ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, సీఎస్ నుంచి క్షేత్రస్థాయి అధికారి వరకు సమన్వయంతో పని చేసి తప్పులు లేకుండా సర్వే నిర్వహించాలని ఆదేశించారు. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, సర్వే గురించి ప్రజలకు తెలిసేలా ప్రచారం చేయాలన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, సర్వే వివరాలు సక్రమంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. అనంతరం జిల్లాల్లో ధాన్యం కొనుగోళ్లపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సత్యప్రసాద్, అదనపు కలెక్టర్ గౌతమ్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్సీని అధిష్టానం గుర్తిస్తుంది'

గంగారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విప్ లక్ష్మణ్ కుమార్, తదితరులు

జగిత్యాల, అక్టోబర్ 29: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిని పార్టీ అధిష్టానం గుర్తిస్తుందని విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. ఇటీవల హత్యకు గురైన కాంగ్రెస్ నాయకుడు మారు గంగారెడ్డి సంతాప సభ మంగళవారం జగిత్యాలలో నిర్వహించగా విప్ లక్ష్మణ్ కుమార్‌తో పాటు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, పార్టీ కోసం ఏళ్లుగా పని చేస్తున్న కార్యకర్తలకు నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలని సీఎం, పీసీసీ అధ్యక్షుడి దృష్టికి తీసుకెళ్తానని స్పష్టం చేశారు. మారు గంగారెడ్డి హత్య కేసులో లోతుగా విచారణ చేపట్టాలని జిల్లా ఎస్పీకి విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సూచించారు. ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మాట్లాడుతూ, నాయకులు ప్రజాక్షేత్రంలో ఉండి, కార్యకర్తల మనోభావాలను గౌరవించాలన్నారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, కార్యకర్తల కోసం పరితపించే నాయకుడు జీవన్ రెడ్డి అని అన్నారు. కార్యక్రమంలో నాయకులు కొత్త మోహన్, బండ శంకర్, విజయలక్ష్మి, దేవేందర్ రెడ్డి, శోభారాణి, అనిత, నందయ్య, కొండ్ర రాంచంద్రారెడ్డి, ఎల్లారెడ్డి, జితేందర్, జున్ను రాజేందర్, దుర్గయ్య, నక్క జీవన్, వేముల సుభాష్, మన్సూర్, రాంచంద్రారెడ్డి, మునీందర్ రెడ్డి, గంగాధర్, గోళ్ల తిరుపతి, చిట్ల లత, తదితరులు పాల్గొన్నారు.

ఎల్వోసీ అందజేత

మెట్‌పల్లి రూరల్, అక్టోబర్ 29: ఆత్మకూర్ గ్రామానికి చెందిన రమేశ్ అనారోగ్యంతో బాధపడుతుండగా చికిత్స కోసం కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ రూ. 1.50 లక్షల ఎల్వోసీ మంజూరు చేయించారు. కాగా, స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం బాధితుడికి ఎల్వోసీ అందజేశారు. ఇక్కడ బీఆర్‌ఎస్ నాయకులు చౌట్‌పల్లి అంజయ్య, తిరుపతి తదితరులున్నారు.

పంటల సాగుపై వీడియో కాన్ఫరెన్స్

సారంగాపూర్, అక్టోబర్ 29: సారంగాపూర్, బీర్‌పూర్‌లోని రైతు వేదికల ఆవరణలో మంగళవారం రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పంటల సాగుకు సంబంధించి వివిధ అంశాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. సారంగాపూర్‌లో ఆయిల్ పామ్ పంటలో వచ్చే తెగుళ్లు, కీటకాలు, యాజమాన్య పద్ధతులపై జిల్లా ఉద్యానవన అధికారి దేవ ప్రసాద్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో ఏఈవోలు వెంకటేశ్, వినోద్, భరత్, ఫీల్డ్ ఆఫీసర్ మల్లేశం, ఆదర్శ రైతులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నేడు బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో సంబురాలు

కోరుట్ల, అక్టోబర్ 29: విద్యుత్ చార్జీలు పెంచవద్దని బీఆర్‌ఎస్ చేసిన పోరాటం సఫలీకృతమైన నేపథ్యంలో పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద బుధవారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహిస్తున్నట్లు పార్టీ శ్రేణులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంబురాలకు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల హాజరవుతారని పేర్కొన్నారు.

ఆర్టీసీ కార్గో సేవలను వినియోగించుకోవాలి

కోరుట్ల, అక్టోబర్ 29: ఆర్టీసీ కార్గో లాజిస్టిక్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కార్గో లాజిస్టిక్స్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లితో పాటు ఇతర కార్గో లాజిస్టిక్స్ కేంద్రాల నుంచి హోమ్ డెలివరీ బుకింగ్ చేసుకున్న పార్సిళ్లను హైదరాబాద్‌లోని తమ ఇంటి వద్దకే చేర్చనున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని 31 కేంద్రాల్లో హోమ్ డెలివరీ అవకాశం ఉన్నట్లు తెలిపారు. వివరాలకు డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు సురేశ్ సెల్ 77802 50439 (జగిత్యాల), రమేశ్ సెల్ 91542 98572 (కోరుట్ల), ఉపేందర్ సెల్ 91542 98574 (మెట్‌పల్లి) సంప్రదించాలని కోరారు.

వరి పంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు

జగిత్యాలటౌన్/కోరుట్ల రూరల్, అక్టోబర్ 29 : మండలంలోని ఐలాపూర్‌లో గ్రామంలో రైతు భరత్‌వాజ్ శర్మ సాగు చేస్తున్న చిరు దశలో ఉన్న వరి వంగడాలను మంగళవారం కరీంనగర్ జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి, శ్రీధర్‌సిద్ధి, రాజేంద్రప్రసాద్, విద్యార్థులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

పట్టణ సమగ్రాభివృద్ధికి ప్రత్యేక చర్యలు

మెట్‌పల్లి, అక్టోబర్ 29: పట్టణ సమగ్రాభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేని సుజాత అన్నారు. మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఆమె అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి ప్రవేశపెట్టిన ఏడు అంశాలతో కూడిన ఏజెండాను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ, నాలాలను, ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలని, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందిన పారిశుధ్య కార్మికురాలు గంగును శాలువాతో సత్కరించారు. సమావేశంలో కమిషనర్ మోహన్, వైస్ చైర్మన్ చంద్రశేఖర్ రావు, డీఈఈ నాగేశ్వర్‌రావు, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాయికల్, అక్టోబర్ 29: రాయికల్ మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్మన్ మోర హన్మాండ్లు అధ్యక్షతన నిర్వహించారు. పట్టణంలో పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సమస్యలపై కౌన్సిల్ సభ్యులు చర్చించారు. 13 అంశాలను ఏకగ్రీవంగా తీర్మానించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, వైస్ చైర్మన్ రమాదేవి, ఏఈ సీవీ ప్రసాద్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్, టేబుల్ టెన్నిస్ జట్ల ఎంపిక

జగిత్యాల రూరల్, అక్టోబర్ 29: జిల్లా కేంద్రంలోని వివేకానంద మినీస్టేడియంలో మంగళవారం జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్, టేబుల్ టెన్నిస్ జట్ల ఎంపిక పోటీలను నిర్వహించినట్లు జిల్లా క్రీడల కార్యదర్శి లక్ష్మీరామ్‌నాయక్ ప్రకటనలో తెలిపారు. త్వరలో నిర్వహించే జిల్లా స్థాయి క్రీడల్లో ఎంపికైన జట్లు పాల్గొంటాయని పేర్కొన్నారు.

ఆర్‌జీబీ జనరల్ బాడీ సభ్యుల ఎన్నిక

జగిత్యాల రూరల్, అక్టోబర్ 29: క్రిబ్‌కో ఎరువుల కంపెనీ పదో ఆర్‌జీబీ రిప్రజెంటేటివ్ జనరల్ బాడీ సభ్యులుగా గంభీరావుపేట సహకార సంఘం చైర్మన్ కొండూరి రవీందర్ రావు, పొరండ్ల చైర్మన్ సింగిరెడ్డి స్వామిరెడ్డి, అల్మాస్‌పూర్ చైర్మన్ వుచ్చిడి మోహన్ రెడ్డి, చొప్పదండి చైర్మన్ వెల్మ మల్లారెడ్డి, కల్లెడ చైర్మన్ అన్నమనేని సందీప్ రావు ఎన్నికయ్యారు. జనరల్ బాడీ సభ్యులను క్రిబ్‌కో స్టేట్ మార్కెటింగ్ మేనేజర్ రామకృష్ణయ్య అభినందించారు.

బాస్కెట్ బాల్ జట్ల ఎంపిక పోటీలు

జగిత్యాల రూరల్, అక్టోబర్ 29: జిల్లా కేంద్రంలోని వివేకానంద మినీ స్టేడియంలో మంగళవారం ఉమ్మడి జిల్లా స్థాయి పాఠశాలల అండర్-14, 17 బాలబాలికల బాస్కెట్ బాల్ జట్లను ఎంపిక చేసినట్లు జిల్లా క్రీడల కార్యదర్శి లక్ష్మీరామ్‌నాయక్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. పేట జిల్లా సభ్యులు విశ్వప్రసాద్, మల్లీశ్వరి, జమున, వెంకట్, లక్ష్మి, మంగ, శ్రీరామ్, తదితరులు పాల్గొన్నారు.

ఐఎంఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడికి సత్కారం

సారంగాపూర్, అక్టోబర్ 29: ఐఎంఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఇటీవల నియామకమైన డాక్టర్ గురువారెడ్డికి కాంగ్రెస్ మండల నాయకులు మంగళవారం జగిత్యాలలో పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కొండ్ర రాంచందర్ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ సభ్యత్వ నమోదు

జగిత్యాల, అక్టోబర్ 29: రాష్ట్ర ప్రభుత్వం కనీసం మూడు డీఏలను విడుదల చేయాలని టీపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. జగిత్యాల రూరల్, అర్బన్ మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలను మంగళవారం టీపీటీఎఫ్ నాయకులు సందర్శించారు. పాఠశాలల్లో నెలకొన్న సమస్యల వివరాలను సేకరించడంతోపాటు ఉపాధ్యాయులతో సభ్యత్వం నమోదు చేయించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు బోగ రమేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొక్కుల రాంచంద్రం, నాయకులు రఘుపతి యాదవ్, చంద్రశేఖర్, గోవర్ధన, మహ్మద్ ఫక్రొద్దీన్, సత్యనారాయణ, సంతోష్‌కుమార్, సుధాకర్ పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ముఖ్య కార్యకర్తల సమావేశం

కోరుట్ల, అక్టోబర్ 29: ఈనెల 31న ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని సంఘం అధ్యక్షుడు సుతారి రాములు కార్మిక శ్రేణులకు పిలుపునిచ్చారు. పట్టణంలోని సీ ప్రభాకర్ భవన్‌లో మంగళవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా కార్మిక జెండాలు ఎగురవేయాలని కోరారు. సమావేశంలో సంఘం సభ్యులు చెన్న విశ్వనాథం, కొక్కుల శాంత, ఎన్నం రాధ, తదితరులు పాల్గొన్నారు.

మట్టి పాత్రల్లోనే దీపాలు వెలిగించాలి

కోరుట్ల, అక్టోబర్ 29: దీపావళి రోజు మట్టి పాత్రల్లోనే దీపాలు వెలిగించాలని మున్సిపల్ కమిషనర్ తిరుపతి సూచించారు. పట్టణంలో మున్సిపల్ ఆధ్వర్యంలో స్వచ్ఛ దివాళి, శుభ్ దివాళి కార్యక్రమంలో భాగంగా శివ దుర్గా మహిళా సమాఖ్య సభ్యులు ఏర్పాటు చేసిన మట్టి పాత్రల స్టాల్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మట్టి పాత్రలు తయారు చేసిన మహిళా సమాఖ్య సభ్యులను ప్రశంసా పత్రాలతో సన్మానించారు. ఇక్కడ శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, ఎన్విరాన్మెంటల్ ఇంజినీరు మహేశ్, మెప్మా సీఈవో సంధ్య, గంగారాణి, మహిళా సమాఖ్య సభ్యులు ఉన్నారు.

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

గొల్లపల్లి, అక్టోబర్ 29: యువత, విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని కరీంనగర్ జిల్లా యూత్ అధికారి రాంబాబు సూచించారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో మంగళవారం విద్యార్థులకు మాదకద్రవ్యాల దుర్వినియోగంపై మై భారత్-నెహ్రూ యువ కేంద్ర (జగిత్యాల) ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాంబాబు మాట్లాడుతూ, విద్యార్థులు మంచి లక్ష్యాన్ని ఎంచుకొని సాధించాలని సూచించారు. ప్రిన్సిపాల్ రవికుమార్, చైల్డ్ మ్యారేజ్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ భూమేశ్, నిర్వాహకుడు గణేశ్ పాల్గొన్నారు.

కాశీహనుమాన్ ఆలయంలో చోరీ

మెట్‌పల్లి, అక్టోబర్ 29: పట్టణంలోని కాశీ హనుమాన్ ఆలయంలో చోరీ జరిగింది. మంగళవారం తెల్లవారు జామున 4 గంటల ప్రాంతంలో ఓ అగంతకుడు ఆలయంలోకి ప్రవేశించాడు. గర్భగుడి ముఖద్వారం తాళం పగులగొట్టి లోపలికి చొరబడ్డాడు. గండదీపం, శఠగోపం, తదితర 6 రకాల ఇత్తడి వస్తువులను అపహరించుకువెళ్లాడు. ఆ అగంతకుడు ఆలయంలోకి ప్రవేశించడం, సామగ్రితో వెళ్లిపోవడం దృశ్యాలంతా సీసీ కెమెరాలో నిక్షిప్తమయ్యాయి. కాగా, ఆలయ అభివృద్ధి కమిటీ పాలకవర్గ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ చిరంజీవి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సీసీ ఫుటేజీలను పరిశీలించి, దొంగ కోసం గాలింపు చేపట్టారు. అపహరణకు గురైన ఇత్తడి వస్తువుల విలువ సుమారు రూ. 15 నుంచి 20 వేలు వరకు ఉంటుందని ఆలయ కమిటీ చైర్మన్ చెర్లపల్లి రాజేశ్వర్‌గౌడ్ తెలిపారు.

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి

జగిత్యాల కలెక్టరేట్, అక్టోబర్ 29: ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో పోలీసులు మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించగా, పోలీసు అధికారులు, పోలీసులు, యువకులు రక్తదానం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ, ప్రతి మూడు నెలలకొకసారి రక్తదానం చేస్తే శరీరంలో కొత్త రక్తం ఉత్పత్తి అయి ఆరోగ్యవంతంగా ఉంటామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ భీంరావు, డీఎస్పీ రఘుచందర్, జగిత్యాల టౌన్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్, ఆర్ఐ వేణు, ఎస్ఐలు, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు, పోలీసు సిబ్బంది, యువత పాల్గొన్నారు.

ఆలయాల్లో భక్తుల రద్దీ

మల్యాల, అక్టోబర్ 29: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానంలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. ఆలయ ఏఈవో వైరాగ్యం అంజయ్య భక్తుల రద్దీని గమనిస్తూ క్యూలైన్లను క్రమబద్ధీకరించారు. కాగా, ఆంజనేయస్వామి వారిని హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ ఎస్పీ రమణారెడ్డి, జగిత్యాల అదనపు కలెక్టర్ రాంబాబు కుటుంబ సభ్యులతో వేర్వేరుగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు వారికి ఘన స్వాగతం పలికి, పూజల అనంతరం తీర్థప్రసాదాలు అందజేసి, ఆశీర్వచనం చేశారు.

ధర్మపురి, అక్టోబర్ 29: ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి క్షేత్రానికి తరలివచ్చిన భక్తులు మొదట గోదావరి నదిలో స్నానాలాచరించి సంకల్పాది పూజలు జరిపించుకున్నారు. అనంతరం లక్ష్మీనరసింహస్వామి ఆలయంతో పాటు అనుబంధ ఆలయాల్లో స్వామివారలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

ఫేస్‌బుక్ మిత్రుల ఔదార్యం

ధర్మపురి, అక్టోబర్ 29: రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాలుడి చికిత్స కోసం ఫేస్‌బుక్ మిత్రులు రూ.1.29 లక్షల ఆర్థిక సాయాన్ని అందజేశారు. వివరాల్లోకి వెళ్తే... ధర్మపురికి చెందిన నారవేని కుమార్-మమత దంపతులకు కుమారుడు, కూతురు ఉన్నారు. కుమార్ ఉపాధి కోసం దుబాయ్ వెళ్లాడు. అయితే, గత నెల 15న పొలాస వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వీరి కూతురు శ్రీనిధి మృతి చెందగా, కొడుకు మల్లికార్జున్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మల్లికార్జున్ దవాఖానలోనే చికిత్స పొందుతున్నాడు. వైద్యానికి లక్షలాది రూపాయలు ఖర్చు అవుతుండడంతో నిరుపేదలైన తల్లిదండ్రులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారి దీనస్థితిని చూసి ధర్మపురికి చెందిన సామాజిక సేవకుడు రేణికుంట రమేశ్ స్పందించి ఈనెల 3న మిత్రులు ఆదుకోవాల్సిందిగా కోరుతూ మమత బ్యాంక్ ఖాతా వివరాలతో ఫేస్‌బుక్‌లో పోస్టు చేశాడు. ఈ పోస్టుకు స్పందించిన తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎన్నారైలు మమత బ్యాంకు ఖాతాల్లో రూ.1.29 లక్షలు జమ చేశారు. కాగా, తహసీల్దార్ కృష్ణచైతన్య, యూనియన్ బ్యాంక్ మేనేజర్ ఆశిశ్ నగదును మమతకు అందజేశారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ఉత్తమ పురస్కారాలు

కోరుట్ల, అక్టోబర్ 29: విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన ఆర్టీసీ ఉద్యోగులకు పట్టణంలోని డిపో ఆవరణలో మంగళవారం ప్రగతి చక్రం పురస్కారాలతో పాటు నగదు బహుమతులను డీఎం మనోహర్ అందజేశారు. కార్యక్రమంలో ఆఫీస్ సూపరింటెండెంట్ గంగారం, ఫైనాన్షియల్ డిప్యూటీ సూపరింటెండెంట్ బాబు, ట్రాఫిక్ సూపరింటెండెంట్ వర్జిలాల్, అసిస్టెంట్ మెకానికల్ ఫోర్‌మెన్ ఖాన్, సెక్యూరిటీ హెడ్ కానిస్టేబుల్ శేఖర్, ట్రాఫిక్, గ్యారేజ్ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

కథలాపూర్, అక్టోబర్ 29: కథలాపూర్ మండలం పోసానిపేట గ్రామ శివారులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దుంపేట గ్రామానికి చెందిన తోట లింగం (66) మృతిచెందాడు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. దుంపేటకు చెందిన తోట లింగం మంగళవారం బైక్‌పై తాండ్ర్యాల గ్రామానికి వెళ్లి తిరిగి వస్తున్నారు. పోసానిపేట శివారులోని ఎల్లమ్మ ఆలయం వద్ద ఎదురుగా వస్తున్న గూడ్స్ వ్యాన్ ఢీకొట్టడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ నవీన్‌కుమార్ పరిశీలించి, మృతదేహాన్ని కోరుట్ల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. లింగం సోదరుడు రాజేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నవీన్‌కుమార్ పేర్కొన్నారు.

జగిత్యాల రూరల్, అక్టోబర్ 29: జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేట గ్రామంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే.. జగిత్యాల రూరల్ మండలం గుట్రాజ్‌పల్లికి చెందిన బొద్దుల నగేశ్ (35) ద్విచక్ర వాహనంపై జగిత్యాల నుంచి ఇంటికి వెళ్తున్నాడు. కాగా, తిప్పన్నపేట వద్ద ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనదారుడు ఢీకొనడంతో కింద పడిపోయాడు. నగేశ్ తలపై నుంచి గుర్తు తెలియని వాహనం వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటన స్థలానికి రూరల్ పోలీసులు వెళ్లి వివరాలు సేకరించారు.

మల్యాల, అక్టోబర్ 29: జగిత్యాల-కరీంనగర్ ప్రధాన రహదారిపై కొండగట్టు దిగువన గల ఓ పెట్రోల్ బంక్ సమీపంలో ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరు మృతి చెందినట్లు ఎస్ఐ నరేశ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వేములవాడ నుంచి జగిత్యాల వైపు వస్తున్న బస్సు కొండగట్టులో 40 నుంచి 45 ఏళ్ల మధ్య వయసు గల గుర్తుతెలియని వ్యక్తిని ఢీకొట్టగా మృతి చెందాడన్నారు.

భగవాన్ ధన్వంతరి జయంతి వేడుకలు

కథలాపూర్, అక్టోబర్ 29: కథలాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో భగవాన్ ధన్వంతరి జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయుర్వేద వైద్యం కోసం భగవాన్ ధన్వంతరి చేసిన సేవలను పలువురు కొనియాడారు. అనంతరం 9వ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ నిర్వహించిన లైవ్ టెలీకాస్ట్‌కు అధికారులు హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామింగ్ అధికారి రవీందర్, వైద్యాధికారి సింధూజ, ఆయుర్వేద వైద్యాధికారి రజిత, సూపర్‌వైజర్ శ్రీధర్, ఫార్మసిస్ట్ విజయ్‌కుమార్, సత్యనారాయణ, మురళి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం/గొల్లపల్లి, అక్టోబర్ 28: ఇబ్రహీంపట్నం, గొల్లపల్లిలో నాయీబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో భగవాన్ ధన్వంతరి జయంతి వేడుకలను నిర్వహించారు. ఇబ్రహీంపట్నంలో నాయీబ్రాహ్మణ సంఘం మండలాధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి సమ్మెట రాజేశ్, ఉపాధ్యక్షుడు రాచకొండ రవి, కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్, శోభన్, భూమన్న, సంజీవ్, సతీశ్, రవి, రాజగంగారాం, గొల్లపల్లిలో నాయీబ్రాహ్మణ సంఘం యువజన రాష్ట్ర కార్యదర్శి ఎనగందుల అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి

కథలాపూర్, అక్టోబర్ 29: గ్రామాల్లో ఉపాధి హామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీవో రాజశేఖర్ పేర్కొన్నారు. కథలాపూర్ మండలం సిరికొండ గ్రామంలో మంగళవారం ఉపాధిహామీ గ్రామసభ నిర్వహించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టే అభివృద్ధి పనులపై చర్చించారు. ఏపీవో రాజేందర్, టీఏ శ్రీధర్, కార్యదర్శి నర్సారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ నవీన్ పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజా వేదిక

గొల్లపల్లి, అక్టోబర్ 29: గొల్లపల్లి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం మండలంలో గతేడాది జరిగిన ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. పనుల్లో రూ. 1,41,642 అవకతవకలు జరిగినట్లు అధికారులు వెల్లడించారు. ప్రజా వేదికలో డీఆర్డీవో మదన్ మోహన్, అధికారులు కిషన్ రెడ్డి, రాంరెడ్డి, సురేశ్ రెడ్డి, ప్రభాకర్ రావు, దేవేందర్ రెడ్డి, పాండురంగ, వేణు, అనిల్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ధర్మపురి, అక్టోబర్ 29: ఆరెపెల్లి మాజీ ఎంపీటీసీ బొర్లకుంట రాజయ్య ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబసభ్యులను మంగళవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పరామర్శించారు. రాజయ్య కుటుంబాన్ని ప్రభుత్వ తరపున ఆదుకుంటామని హామీ ఇచ్చారు. విప్ వెంట నాయకులు, తదితరులున్నారు.

డీఎస్పీకి సత్కారం

జగిత్యాల, అక్టోబర్ 29: జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఉత్కృష్ట అవార్డుకు ఎంపిక కాగా, పట్టణంలోని కార్యాలయంలో మంగళవారం ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం నాయకులు పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించారు. సీఐ వేణుగోపాల్, ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం నాయకులు శ్యామ్, విజయ్ కుమార్, సత్తయ్య, కాంపల్లి గంగాధర్, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం

మెట్‌పల్లి రూరల్, అక్టోబర్ 29: మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ బీసీ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో మండల వైద్యాధికారి అంజిత్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు.కార్యక్రమంలో ఆర్బీఎస్కే వైద్యాధికారి డాక్టర్ రాధారాణి, ప్రిన్సిపాల్ మాధవీలత, హెచ్ఈవో రమేశ్, సూపర్‌వైజర్ ధనుంజయ్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

మల్లాపూర్/పెగడపల్లి, అక్టోబర్ 29: తమ సమస్యలను రాష్ట్ర సర్కారు పరిష్కరించాలని తెలంగాణ జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు వంశీధర్, ప్రధాన కార్యదర్శి నరేశ్ కోరారు. కాగా, ఈ మేరకు మల్లాపూర్, పెగడపల్లి మండల పరిషత్ కార్యాలయాల్లో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీవో జగదీష్‌కు మంగళవారం వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో కార్యదర్శులు మురళి, నారాయణరెడ్డి, బాలచందర్, రంజిత్, శ్రీధర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆలయాలకు విరాళం

మేడిపల్లి, అక్టోబర్ 29: భీమారం మండలం మన్నెగూడెం గ్రామ శివారులోని పల్లగుట్టపై నిర్మిస్తున్న గణపతి, రాముడు, వేణుగోపాలస్వామి, అయ్యప్ప ఆలయాలకు గ్రామానికి చెందిన బొబ్బల గంగారాం-మీన దంపతుల కుమారుడు నరేశ్ రూ. 1,11,111 మంగళవారం తన సోదరుడు మహేశ్ చేతుల మీదుగా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ తేలు నరేశ్, ఎంపీటీసీల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు చెన్నమనేని రవీందర్‌రావు, సభ్యులు చెన్నమనేని నర్సింగరావు, ఏనుగంటి హరీశ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు మల్యాలకు మంత్రుల రాక

మల్యాల, అక్టోబర్ 29: మల్యాల ఎక్స్ రోడ్ చౌరస్తా నుంచి కాసారం వరకు చేపట్టే డబుల్ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రారంభిస్తారని మండల బీజేపీ, కాంగ్రెస్ నాయకులు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. నాయకులు, ప్రజలు తరలిరావాలని కోరారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

★I, Nagarapu Gangadhar S/o. Nagarapu Nadipi Gangaram (Old Name) H.No. 8-51/68, Rudrangi Rajanna Sircilla Dist. TS. My Surname was Changed To Nagaram Gangadhar S/o. Nagaram Nadipi Gangaram (New Name) NTK-00000

కావలెను

★కరీంనగర్ ప్రశాంత్‌నగర్ లోని హిమాలయ మినరల్ వాటర్ ప్లాంట్‌లో పనిచేయుటకు డ్రైవర్లు మరియు హెల్పర్లు (M/F) కావలెను. భోజనం+వసతి కల్పించబడును. సంప్ర|| సెల్: 7981054327, 7093413912 NTK-335404

పాస్‌పోర్ట్ పోయినది

★పురుమల్ల పూర్ణిమ S/o సత్తయ్య, H.No. 9-9-154/1, శ్రీహరినగర్, రోడ్ నెం.3, రాంనగర్, కరీంనగర్ మం|| & జి|| నా యొక్క పాస్‌పోర్టు నెం|| N8546133 రామ్‌నగర్ నుండి గీతాభవన్ వెళ్ళుచుండగా పోయినది. దొరికిన వారు సంప్ర|| 9440568299 NTK-00000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 9182 777 571
9182 777 189